# సిపిఐ (ఎం-ఎల్) కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ లెనిన్‌కు నివాళులు




ప్రసంగిస్తున్న కా॥ అరవింద్‌సిన్హా; వేదికపై కామ్రేడ్స్ ఎస్.ఝూన్సీ, విజయకుమార్, పి.కె.షాహి

**తొట్టతొలి** సోషలిస్టు రాజ్య నిర్మాత, మహత్తర అక్టోబర్ విప్లవ నాయకుడు, మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి (21- 1-24) సందర్భంగా **సిపిఐ (ఎంఎల్) కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 26వ తేదీ** సాయంత్రం ఐదు గంటలకు స్థానిక లెనిన్ సెంటర్లోని లెనిన్ విగ్రహం ఎదుట 'లెనినిజం చిరస్థాయి అగుగాక' అని నినదిస్తూ బహిరంగ సభ స్ఫూర్తిదాయకంగా జరిగింది.

తొలుత **సిపిఐ (ఎంఎల్) కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ అరవింద్ సిన్హాతో** పాటు కామ్రేడ్స్ గుర్రం విజయకుమార్, పీకే షాహీ, సింహాద్రి ఝూన్సీ, ఇతర నాయకులు కామ్రేడ్ లెనిన్ చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులు అర్పించారు.

**కామ్రేడ్ గుర్రం విజయ కుమార్** అధ్యక్షోపన్యాసం చేస్తూ మార్క్సిజానికి కాలం చెల్లిందనే వాదనలను ఖండించారు. లెనిన్ బోధించిన వర్గ పోరాటాల దారిలో ముందుకు సాగుదామని ఆయన పిలుపునిస్తూ కామ్రేడ్ లెనిన్‌కు నివాళులర్పించారు.

**కామ్రేడ్ అరవింద్ సిన్హా (బీహార్)** మాట్లాడుతూ ప్రపంచంలో తొలి సోషలిస్టు విప్లవానికి నాయకత్వం వహించిన కామ్రేడ్ లెనిన్ పట్ల మన గౌరవాన్ని తెలియజేసేందుకు ఇక్కడ సమావేశమయ్యామన్నారు. కామ్రేడ్ లెనిన్ ఈనాటి పరిస్థితిని చూడగలిగితే మన పట్ల తీవ్ర ఆగ్రహాన్ని ప్రదర్శించేవారని ఆయన చెప్పారు. పార్లమెంటరీ విధానాల ద్వారా కొన్ని హక్కులు సాధించుకోగలుగుతామేమో గాని పెట్టుబడిదారీ విధానాన్ని ధ్వంసం చేసి సోషలిజం స్థాపన అసాధ్యమన్న లెనిన్ వివరణను గుర్తు చేశారు. కామ్రేడ్ లెనిన్ నాయకత్వంలో విజయవంతమైన సోషలిస్టు విప్లవం, తదనంతరం కామ్రేడ్ స్టాలిన్ నాయకత్వంలో అద్భుత విజయాలను సాధించడం ప్రపంచం చూసిందన్నారు.

కామ్రేడ్ మావో నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ, జపాన్ సామ్రాజ్యవాదాన్ని ఓడించి సామ్యవాదాన్ని నెలకొల్పిందన్నారు. రష్యాలో కృశ్చేవ్ ముందుకు తెచ్చిన మూడు శాంతి సూత్రాలపై మహోపాధ్యాయులు తీవ్రమైన సిద్ధాంత పోరాటం సాగించి మార్క్సిజాన్ని పరిరక్షించారన్నారు.

మన దేశంలో నూతన ప్రజాస్వామికాన్ని స్థాపించాలంటే మనం తిరిగి లెనిన్ బోధనల వద్దకు వెళ్లాలన్నారు. సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాలన్నింటా ఫాసిజాన్ని పెంచి పోషిస్తోందని, పెట్టుబడిదారీ విధానం ఒక వ్యవస్థగా విఫలమైందని అన్నారు. యువజనులంతా ఈరోజు మార్క్స్, లెనిన్ బోధనలను అధ్యయనం చేయాలని, వారి జీవితాల్లోని ఆదర్శాలను స్వీకరించాలని, యువతలో విభేదాలను సృష్టించే పాలకుల కుట్రలను వమ్ము చేయాలని, ప్రజా పోరాటాలను ముందుకు తీసుకువెళ్లాలంటూ కామ్రేడ్ అరవింద్ సిన్హా తన ప్రసంగం ముగించారు.

**కామ్రేడ్ పీకే షాహి (ఢిల్లీ)** ప్రసంగిస్తూ 'ఈ ప్రపంచాన్ని నిర్వచించటం కాదు, మార్చాలి' అన్న కామ్రేడ్ మార్క్స్ పిలుపును గుర్తు చేశారు. లెనిన్ ఆ విధంగా ప్రపంచ గతిని మార్చే సోవియట్ విప్లవాన్ని విజయవంతం చేశాడన్నారు. 1947 తర్వాత నుండి మన దేశ పాలకులు రష్యా ప్రభావాన్ని తప్పక గుర్తించాల్సి వచ్చిందని, అందుకే వారు సోషలిజాన్ని వల్లె వేస్తూ వచ్చారు కానీ ఆచరణలో సంపదల కేంద్రీకరణను సాగించారని చెప్పారు. ఈనాడు ప్రజలు ఎదుర్కొంటున్న ఆకలి, పేదరికం, గిట్టుబాటు ధరలు వంటి అంశాలను గురించి పాలకులు మాట్లాడడం లేదని, దేశంలో పీడిత ప్రజానీకం తమ సమస్యలపై ఉద్యమాలలోకి కదులుతున్నారని చెప్పారు. భారత విప్లవ కమ్యూనిస్టు శక్తులు ఏకమై ప్రజలను నడిపిస్తారనే ఆశాభావం వ్యక్తం చేస్తూ కామ్రేడ్ షాహి తన ఉపన్యాసం ముగించారు.

**కామ్రేడ్ సింహాద్రి ఝూన్సీ** మాట్లాడుతూ సామ్రాజ్యవాదం ఆధారపడే యుద్ధాలు, అవినీతి, సంక్షోభాలకు వ్యతిరేకంగా రైతాంగ మైత్రితో పోరాటం సాగించి సామ్రాజ్యవాదాన్ని ఓడించాలన్నారు. దీనికి ఆయా దేశాల శ్రామిక, పీడిత ప్రజానీకం సంఘటితమై పోరాడటం తప్ప, దగ్గర మార్గం మరొకటిలేదన్నారు. లెనినిజాన్ని మన దేశ పరిస్థితులకు అన్వయించుకోవాలన్నారు. మన దేశంలో అర్ధవలస - అర్ధభూస్వామ్య సమాజాన్ని కూల్చివేసి నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారా సామ్యవాదాన్ని సాధించు

కోవాలన్నారు. కమ్యూనిజానికి కాలం చెల్లలేదని, దోపిడీ పీడనలు ఉన్నంతవరకు కమ్యూనిజం ఉండి తీరుతుందని, ఇది ఓ నిరంతర క్రమమని, మార్క్సిస్టు మహోపాధ్యాయులు మన ముందుంచిన బోధనలను, ఆచరణలను అన్వయించుకుంటూ ముందుకు సాగాలని, ప్రజలను విద్యావంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు

**కామ్రేడ్ గుర్రం విజయ్‌కుమార్** తన ముగింపు ఉపన్యాసంలో భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం అనేక పాయలుగా చీలి ఉందని, దీనికి మూలమైన సిద్ధాంత, రాజకీయ విభేదాలు రాజకీయ కార్యాచరణ ప్రాతిపదికన పరిష్కారం కావాలన్నారు. భారతదేశంలో బూర్జువావర్గం ప్రజాతంత్ర కర్తవ్యాలను నిర్వహించ జాలదని తేటతెల్లమైందన్నారు. శాంతియుత విప్లవం, అంటే పార్లమెంటులో మెజారిటీ సాధించడమే లక్ష్యంగా ఆంతరంగిక సంఘర్షణ, చర్చలు సాగుతున్నాయిగానీ, ప్రజాతంత్ర కర్తవ్యాలను ఎలా పరిపూర్తి చేయాలనే దానిపై కాదన్నారు. భూమిపై అదుపు గురించిన రూపాలు మారినా, భూమి పేదల హక్కుగా అందలేదని గుర్తు చేశారు. గత కాలంలో కమ్యూనిస్టులు సాగించిన తీరులో వర్గ పోరాటాలు నిర్మించాలని, లెనినిజం మనల్ని ఆదేశిస్తుంద న్నారు. మతోన్మాద ఫాసిజం, దానికి నాయకుడైన మోడీ, ఈనాడు దోపిడీ పాలకులకు అవసరమయ్యాడని, హిందూ వాదానికి సంబంధించి కాంగ్రెస్, బిజెపిలు రెండూ బొమ్మ బొరుసులేనని, మతతత్వం పెరగకుండా నిరోధించే చర్యలను కాంగ్రెస్ ఏనాడూ చేపట్టలేదని ఆయన గుర్తు చేశారు.

కమ్యూనిస్టులు స్వతంత్ర భూమికపై నిలబడితే మాత్రమే కార్మిక వర్గాన్ని నడిపించగలరని అదే ఫాసిజాన్ని ఎదుర్కొనే మార్గమని, సామాజిక విప్లవ కర్తవ్యంతో పాటు ఈ కర్తవ్యాన్ని కూడా చేపట్టాలని, ఒక ఐక్య కార్యాచరణ వేదికలోకి రావలసిన పరిస్థితులు మన ముందు ఉన్నాయని తెలియజేస్తూ ఆయన సభను ముగించారు.

ప్రజా కళాకారులు, ప్రజానాట్యమండలి కళాకారులు అమరులపై, దేశ- ప్రజల సమస్యలపై పోరాడిన పాటలు ఆకట్టుకున్నాయి. అంర్జాతీయ శ్రామికగీతంతో సభ ముగిసింది.

*****